ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
శనివారం 13 సెప్టెంబరు 2025



రుణం చెల్లించని ప్యాక్స్ డైరెక్టర్ల తొలగింపు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించని ఎల్లారెడ్డిపేట, అల్మాస్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని నారాయణపూర్, బండలింగంపల్లి, అల్మాస్‌పూర్, వీర్నపల్లి గ్రామాలకు చెందిన నలుగురు ప్యాక్స్ డైరెక్టర్లను పదవి నుంచి తొలగిస్తూ జిల్లా సహకార అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రుణాలు చెల్లించకుండా డైరెక్టర్లుగా కొనసాగుతుండడం వల్ల చర్యలకు ఉపక్రమించారు. సహకార సంఘం నిబంధనల మేరకు డైరెక్టర్లపై వేటు వేశామని అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఏళ్లతరబడి తమ రుణాలను చెల్లించకుండా డైరెక్టర్లు సంబంధిత శాఖ సిబ్బందిని సమన్వయం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నలుగురిని అధికారులు డైరెక్టర్ పదవుల నుంచి తొలగించడంతో ఆ స్థానంలో ఎవరిని నియమిస్తారనే ఉత్కంఠ నెలకొంది.

పాడి పశువులతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డి


ముస్తాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాడిపశువుల ద్వారా పేద రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నామాపూర్ గ్రామంలో పాడి పశువులను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని కోరారు. గ్రామంలో 15 మంది ఎస్సీ లబ్ధిదారులు రూ 2 లక్షల చొప్పున 30 పాడి పశువులను పశువైద్యాధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, గజ్జెల రాజు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సన్నాల వైపే మొగ్గు

- జిల్లా వ్యాప్తంగా 12 వేల ఎకరాల్లో సాగు
- ఖరీఫ్‌లో 1.84 లక్షల ఎకరాల్లో వరి..
- యాసంగిలో సన్నరకం ధాన్యం బోనస్ పెండింగ్..
- జిల్లాలో 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)





యాసంగి సన్నాల ధాన్యం బోనస్ డబ్బులు ఇంకా జమ కాలేదు. అయినా ఖరీఫ్ సీజన్‌లో రైతులు సన్న రకాల సాగుకు మొగ్గు చూపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఖరీఫ్ పంటల సాగులో వరినాట్లు ముగిసాయి. జిల్లాలో 1.84 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా 12వేల ఎకరాల్లో సన్నరకం ధాన్యం సాగు చేశారు. 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహంగా క్వింటాలుకు రూ 500 బోనస్ అందిస్తుండటంతో రైతులు సన్నాల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. యాసంగిలో విక్రయించిన సన్న రకం ధాన్యానికి రావాల్సిన బోనస్ పెండింగ్ ఉన్నప్పటికీ జిల్లా రైతులు సన్న రకాల సాగు వైపు ఆసక్తి చూపారు.

జిల్లాలో బోనస్ రూ.4.38 కోట్లు పెండింగ్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి సీజన్లో 244 కొనుగోలు కేంద్రాల ద్వారా 44767 మంది రైతుల నుంచి రూ 627.50 కోట్లు విలువైన 2.70లక్షల మెట్రిక్ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 2.61 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం 9254 మెట్రిక్ ధాన్యాన్ని కొను గోలు చేశారు. సన్నరకం ధాన్యంలో ఐకేపీ ద్వారా 7561 మెట్రిక్ టన్నులు, సింగిల్ విండోల ద్వారా 1588 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 104 మెట్రిక్ ధాన్యాన్ని కొనుగో లు చేశారు. 1255 మంది రైతులు సన్నరకం బోనస్‌కు అర్హులుగా ఉన్నారు. ఇందుకు సం బంధించి బోనస్ బకాయిలు రూ 4.38 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వానాకాలం సీజన్ సాగు పనులు పూర్తి అయినా సన్న రకం బోన స్ విడుదల కాకపోవడంతో రైతులకు పెట్టు బడికి ఉపయోగకరంగా లేకుండా పోయింది.

జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో పంటల సాగు

వానాకాలం సీజన్‌కు సంబంధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2,35,330 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వరి 1,84,310 ఎకరాలు, మొక్క జొన్న 3,748 ఎకరాలు, పత్తి 46,485 ఎకరాలు, కందులు 660 ఎకరాలు, పెసర 30 ఎకరాలు, ఇతర పంటలు 137 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో సాగుకు సంబంధించి మండలాల్లో గంభీరావుపేట మండలంలో 18,598 ఎకరాల్లో సాగు కాగా, ఇల్లంతకుంటలో 36,970 ఎకరాలు, ముస్తాబాద్‌లో 23,835 ఎకరాలు, సిరిసిల్ల 5,623 ఎకరాలు, తంగళ్లపల్లి 21,086 ఎకరాలు, వీర్నపల్లి 8300 ఎకరాలు, ఎల్లారెడ్డిపేట 21,100 ఎకరాలు, బోయినపల్లి 19167 ఎకరాలు, చందుర్తి 21,367 ఎకరాలు, కోనరావుపేటలో 23140 ఎకరాలు, రుద్రంగి 10,964, వేములవాడ 10038 ఎకరాలు, వేములవాడ రూరల్ 15,142 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో ప్రధాన పంటలుగా వరి, పత్తి సాగు వైపే మొగ్గు చూపారు. జిల్లాలో వరి సాగులో గంభీరావుపేటలో 18500 ఎకరాల్లో నాట్లు వేసుకోగా,

మిగతా 6వ పేజీలో

హామీలను నెరవేరుస్తూ ముందుకు..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బొజ్జపల్లిలో బతుకమ్మ తెప్పకు భూమిపూజ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి 5వ వార్డులో సంఘ భవనాలకు, బొజ్జపల్లిలో బతుకమ్మ తెప్ప, పెద్దమ్మ ఆలయ ప్రహరీగోడ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్కో హామీని నెరవేర్చుతూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ధనిక రాష్ట్రంలో తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయాంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధితో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలను పెంపు, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని గుర్తు చేశారు. ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని అన్నారు. బొజ్జపల్లి బతుకమ్మ తెప్ప నిర్మాణానికి భూమిపూజ నిర్వహించామని అన్నారు. ప్రాంతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, మహిళల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు బతుకమ్మ తెప్పలు ఎంతో ఉపయోగ పడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీరెడ్డి సల్మాన్‌రెడ్డి, బొజ్జ భారతి, రాగిరి నాగరాజు, కాశ శ్రీనివాస్, సిలివేరి శ్రీనివాస్, జడల శ్రీనివాస్, తుమ్మ ప్రశాంత్‌రెడ్డి, బొజ్జ కనుకయ్య, జడల రవీందర్, జ్యోతి, బొజ్జ మల్లయ్య తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి..

- జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్



మొక్కలు నాటుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్

తంగళ్లపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ శివారులోని రవాణా శాఖ డ్రైవింగ్ టెస్ట్ గ్రౌండ్‌లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గ్రౌండ్ చుట్టూ సుమారు 200 మొక్కలను రవాణా శాఖ అధికారులు నాటారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ ప్రతిఇంటి అవరణలో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వంశీధర్, ఎన్ఫోర్స్‌మెంట్ ట్రైనీ సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు గ్రేగర్జాన్ రేనాల్డ్, దండుగుల మనోజ్ కుమార్, జిల్లా రవాణా శాఖ సిబ్బంది కానిస్టేబుల్ ప్రశాంత్, హోమ్ గార్డ్ ఎల్లయ్య పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న రచయిత పెద్దింటి అశోక్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు జీవన నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే అన్ని రంగాల్లో ముందుంటారని రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు 'ప్రేరణ- జీవన నైపుణ్యాలు'పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ, సంబంధాలను మెరుగుపర్చుకోవాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం వరిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మనోహరచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కోసం అన్నదాతల అగచాట్లు..



రాచర్లతిమ్మాపూర్‌లో వేచిఉన్న రైతులు



ఇల్లంతకుంటలో బారులు తీరిన రైతులు



సుద్దాలలో బారులు తీరిన రైతులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూరియా కొరత అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. మండల కేంద్రంతో పాటు రాచర్లతిమ్మాపూర్ గ్రామంలోని గ్రోమోర్, సింగిల్‌విండో ఆధ్వర్యంలోని గోదాం వద్ద శుక్రవారం వేకువజాము నుంచే వర్షంలోనూ రైతులు బారులు తీరారు. ధ్రువీకరణ పత్రాలను వరుసలో పెట్టి పడిగాపులు కాచారు. భారీ సంఖ్యలో రైతులు చేరుకోవడం వల్ల స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల పహారా మధ్య పంపిణీ కొనసాగింది. గంటల తరబడి నిరీక్షిస్తే ఒక్క యూరియా బస్తా అందించారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రోమోర్ కేంద్రానికి 13 టన్నులు, రాచర్లతిమ్మాపూర్‌కు 15 టన్నుల యూరియా సరఫరా కావడంతో రైతులకు అందించామని ఏవో రాజశేఖర్ పేర్కొన్నారు. యూరియా దిగుమతి కావడంతో ప్రతి గ్రామంలో పంపిణీ చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

● ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విక్రయకేంద్రానికి యూరియా బస్తాలు వస్తాయని తెలుసుకున్న రైతులు శుక్రవారం తెల్లవారకమందే వచ్చి క్యూకట్టారు. విక్రయకేంద్రం తెరిచిన తర్వాత యూరియా బస్తాల కోసం పోటీపడ్డారు. పెద్దసంఖ్యలో మహిళా రైతులు సైతం రావడంతో కొంతసేపు తోపులాట జరిగింది. పోలీసులు చేరుకొని రైతులను క్యూలో ఉంచడంతో యూరియా పంపిణీ కొనసాగింది. ప్రభుత్వం వెంటనే రైతుల అవసరాల మేరకు యూరియా తెప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

● కోనరావుపేట : యూరియా కోసం ఉదయం నుంచి రాత్రి వరకు రైతులు పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం పోలీస్ బందోబస్తు మధ్య యూరియాను పంపిణీ చేశారు. కోనరావుపేట మండలం నిజామాబాద్, సుద్దాల గ్రామాల్లో యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయం 6 గంటల నుంచి బారులు తీరారు. సాయంత్రం వరకు కూడా వేచి ఉన్నప్పటికీ కొంతమంది రైతులకు యూరియా దొరకకపోవడంతో నిరాశతో వెళ్లారు. యూరియా కోసం తిప్పలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

● చందుర్తి : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని జోగాపూర్‌లో యూరియా కోసం రైతులు శుక్రవారం తెల్లవారుజామున నుండే చెప్పులు,ఆధార్ కార్డులను పాల డబ్బాలు, చెట్ల కొమ్మలు, వరుస పెట్టి యూరియా కోసం రైతులు బారులు తీరారు. గ్రామానికి ఐకేపీ ఆధ్వర్యంలో 244 యూరియా బస్తాలు సరఫరా చేశారు. సుమారు 250 మంది రైతులకు ఉండగా 190 మంది రైతులకు టోకెన్లు ఇచ్చారు. రైతుకు ఒకటి, రెండు బస్తాల చొప్పున యూరియా బస్తాలను అందజేశారు. ఉదయం నుంచి క్యూలైన్లో గంటల తరబడి వేచి ఉన్న రైతులకు యూరియా బస్తాలు అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. యూరియా బస్తాలు రాగానే పంపిణీ చేస్తామని అధికారులు సర్ది చెప్పారు రైతులు ఆందోళనలు చేపడతారని సమాచారంతో పోలీస్ పహారా నడుమ అధికారులు బస్తాలు పంపిణీ చేశారు.



జోగాపూర్‌లో చెప్పులు, పాలడబ్బాలు క్యూలో పెట్టిన రైతులు

పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తప్పనిసరి : కలెక్టర్



సుద్దాలలో యూరియా గురించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కోనరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం వచ్చే రైతులు తమ వెంట తప్పనిసరిగా పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ తీసుకురావాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. కోనరావుపేట మండలంలోని నిజామాబాద్, సుద్దాల గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో శుక్రవారం రైతులకు యూరియా పంపిణీ చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండలానికి మొత్తం ఎన్ని బస్తాల యూరియా వచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగంను అడిగి తెలుసుకోగా, మొత్తం 1500 బస్తాలు వచ్చిందని కలెక్టర్ దృష్టికి డీఏఓ తీసుకువెళ్లారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగించాలని సూచించారు. అవసరం ఉన్న మేరకే తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మండల వ్యవసాయ అధికారి సందీప్ కుమార్, ఏఈఓ లు అమర్, దివ్య తదితరులు ఉన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అమృత్ లాల్ శుక్లా కార్మిక భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం అగ్రనాయకుడు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడారు. భారత రాజకీయ రంగంలో కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు యోధుల్లో సీతారాం ఏచూరి ఒకరని అన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం ఆయన అనేక ఉద్యమాలు నడిపాడని మతోన్మాద శక్తులు దేశంలో కులమతాల ప్రాతిపదికన ప్రజలను విడగొట్టే ప్రయత్నాలు చేస్తే ఏచూరి ఐక్య పరుస్తూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలకు రూపకల్పన చేశారని అన్నారు. ఏచూరి మరణం సీపీఎంకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, రమేష్‌చంద్ర, నక్క దేవదాస్, సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

అలాగే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, కమిటీ సభ్యులు కడారి శివ, ముబారక్, సాయి, రషీద్, జశ్వంత్, నవీన్, నయిం, సాయి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గజసింగవరంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న రెడ్డబోయిన గోపి

గంభీరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం గజసింగవరం ప్రభుత్వ పాఠశాలలో చదవుతున్న పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు సీఎస్ఆర్ నిధులతో మోడీ గిఫ్ట్ కానుకగా 30 సైకిళ్లను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా పార్లమెంటు పరిధిలో పదో తరగతి చదవుతున్న విద్యార్థులకు ఇప్పటివరకు 20వేల సైకిళ్లను పంపిణీ చేశామని గోపి వెల్లడించారు. విద్యార్థులు కాలినడకన వెళ్లడం వల్ల బడికి ఆలస్యం అవుతుందనే ఉద్దేశ్యంతో ఉచితంగా సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగారాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, మండల ప్రధాన కార్యదర్శులు విగ్నేష్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, నాయకులు సత్యనారాయణ, రాజిరెడ్డి, సర్వోత్తం, నాగరాజుగౌడ్, ఎలెందర్, రవీందర్, ప్రసాద్, మహేష్, బాలరాజు, సుదాకర్, రాజు, నరేష్, సంతోస్, దేవగౌడ్, సంజయ్, బాలకృష్ణ, మధు, నవీన్, చారీ తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు సీఎస్ఆర్ నిధులతో మోదీ గిఫ్ట్ పేరుతో కరీంనగర్ పార్లమెంట్ మెంబర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన జన్మదిన సందర్భంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులకు సైకిళ్లను అందించారు. ఈ మేరకు ముస్తాబాద్ ప్రభుత్వ పాఠశాలకు శుక్రవారం 85 సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి,చిట్నేని శ్రీనివాస్ రావు, పప్పుల శ్రీకాంత్, చిగులు వెంకన్న, రమేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్



- కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు
- స్టేజ్ 2లో 2400 మెగావాట్ల ప్లాంటు నిర్మాణం

జ్యోతినగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ)కు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. 2400 మెగావాట్ల సామర్థ్యంగల టీఎస్ టీపీపీ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ పర్యా వరణ అనుమతులను(ఈసీ) గురువారం రాత్రి సర్క్యూలర్ జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం నిర్మించాల్సిన 4 వేల మెగావాట్ల టీఎస్‌టీపీపీకి సంబంధించి 1600 మెగావాట్ల స్టేజ్1 ఇప్పటికే పూర్తయి విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 2016లో శంకుస్థాపన అయిన స్టేజ్ 1 ఏడాదిన్నర క్రితం పూర్తయింది. మిగతా 2400 మెగావాట్ల(800 మెగావాట్ల 3 యూనిట్లు) ప్రాజెక్టుకు సంబంధించి ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఎనిమిది నెలల తరువాత కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్సును ఇచ్చింది.

● తెలంగాణ సూపర్ థర్మల్ కేంద్రం నేపథ్యం..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన మేరకు ఎన్టీపీసీ సంస్థ తెలంగాణలో 4 వేల మెగావాట్ల ప్రాజెక్టును నిర్మించాలని పేర్కొంది. ఈ మేరకు రామగుండం ఎన్టీపీసీలోనే 4వేల ప్రాజెక్టును నెలకొల్పేందుకు కేంద్రం ఎన్టీపీసీకి అనుమతినిచ్చింది. మొదటగా 1600 మెగావాట్ల ప్రాజెక్టును రామగుండంలో 2016లో మొదలుపెట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ టీఎస్‌టీపీపీకి శంకుస్థాపన చేశారు. 5 సంవత్సరాలలో పూర్తి కావాల్సిన స్టేజ్ 1 కరోనా ఇతర కారణాల వల్ల 2023లో పూర్తయింది. స్టేజ్ 1లో 800 మెగావాట్ల రెండు యూనిట్లను ప్రధాని మోదీ 2024లో జాతికి అంకితం చేశారు. రెండో దశలో 2400 మెగావాట్ల ప్రాజెక్టుకు ఎన్టీపీసీకి గత ఏడాది ఎన్టీపీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అనుమతినిచ్చారు. సుమారు 29,800 కోట్ల రూపాయల వ్యయానికి బోర్డు అనుమతినిచ్చింది. దీంతో స్టేజ్ 2 నిర్మాణానికి సంబంధించి ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. రెండో దశ కాంట్రాక్టు బీహెచ్ఈఎల్‌కు లభించింది. టీఎస్‌టీపీపీ నుంచి 85 శాతం విద్యుత్ తెలంగాణాకే కేటాయిస్తారు. మరో ఒకటి, రెండు నెలల్లో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశాలున్నాయి. 2030 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు మొదలు పెట్టనుంది.

● కొనుగోలుకు ఒప్పందంపై సందిగ్ధత..

టీఎస్‌టీపీపీ స్టేజ్ 2కు సంబంధించి విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) విషయంలో ఇంకా సందిగ్ధత ఉంది. పీపీఏ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. స్టేజ్2 నుంచి యూనిట్‌కు 4.12 రూపాయలకు కొనుగోలు చేసుకునేందుకు ఈఆర్‌సీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ రాష్ట్ర సర్కారు పీపీఏ చేసుకోలేదు. 800 మెగావాట్ల విద్యుత్ మాత్రమే కొనుగోలు చేసుకునేందుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ పీపీఏ మాత్రం చేసుకోకపోవడం గమనార్హం. పీపీఏ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఎన్టీపీసీ వేచి చూస్తున్నట్లు సమాచారం.

టీఎస్‌టీపీపీ స్టేజ్ 2 వివరాలు..

- **సామర్థ్యం:** 2400 మెగావాట్లు(800 మెగావాట్ల 3 యూనిట్లు)
- **ప్రాజెక్టు వ్యయం:** 29,800 కోట్లు
- **టెక్నాలజీ:** ఆధునిక సూపర్ క్రిటికల్ టెక్నాలజీ
- **నీటి సౌకర్యాం:** సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పైపులైన్ ద్వారా సరఫరా
- **బొగ్గు లింకేజీ:** సింగరేణి నుంచి ఏడాదికి 11.5 మిలియన్ టన్నుల బొగ్గు

కరీంనగర్‌లో సినిమా షూటింగ్



ఎల్ఎండీ గేట్ల వద్ద జరుగుతున్న షూటింగ్

తిమ్మాపూర్ (మానకొండూర్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లోయర్ మానేరు డ్యాం వద్ద హీరో శ్రీకాంత్ సినిమా షూటింగ్ శుక్రవారం జరిగింది. ఏడు కొండలవాడా వెంకటరమణ(గోవిందా గోవిందా) అనే శీర్షికతో సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో డ్యామ్‌లో పడ్డ హీరోను చూస్తూ విలపిస్తున్న సంఘటన చిత్రీకరణ చేశారు. హీరోయిన్ లయ తదితర తారాగనం వివిధ పాత్రలలో నటించారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ కరీంనగర్‌కు ఎన్నోసార్లు వచ్చాను... కానీ షూటింగ్ మాత్రం ఇదే మొదటి సారి అని అన్నారు. కరీంనగర్‌లో సినిమా షూటింగ్ చేయడం సంతోషంగా ఉందని ఇక్కడి అధికారులు, పోలీసులు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. పది రోజులు ఇక్కడే షూటింగ్ జరుగుతుందన్నారు. నవంబరులో సినిమా రిలీజ్ అవుతుందని తెలిపారు.

మొరాయించిన రైల్వే గేటు

● గంటపాటు నిలిచిన రాకపోకలు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గంగాధర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధానరహదారిపై గల రైల్వేగేటు శుక్రవారం మొరాయించింది. గేటు లేవకపోవడంతో గంటపాటు ప్రధానరహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు తీవ్రఇబ్బంది పడ్డారు. అనంతరం సిబ్బంది మరమ్మతులు జరిపి గేటు ఎత్తారు. కరీంనగర్, జగిత్యాలలో పనిచేస్తున్న ఉద్యోగులు గేటు లేవకపోవడంతో తీవ్రఇబ్బందులుపడ్డారు. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు సమయానికి గమ్యం చేరలేకపోతున్నామని వాపోయారు. తరచుగా ఇదేపరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు వాపోయారు. అధికారులు గేటు మొరాయించకుండా చూసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

మందు బాబులకు జరిమానా

వేములవాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 130మంది మందుబాబులకు వేములవాడ న్యాయస్థానం జరిమానా విధించినట్లు పట్టణసీఐ వీరప్రసాద్ తెలిపారు. 14రోజుల వ్యవధిలో మద్యం సేవించివాహనాలు నడుపుతూ పట్టుబడిన 130మందిని శుక్రవారం వేములవాడ న్యాయస్థానంలో హాజరుపరిచామని తెలిపారు. ఇందులో 30మందికి 10వేల చొప్పున, 30మందికి 5వేల చొప్పున, మరో70మంది వాహనదారులకు 2000 రూపాయల చొప్పున న్యాయమూర్తి ప్రవీణ్ జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాల నడిపిన వారికి కౌన్సె లింగ్ నిర్వహించి మరోసారి మద్యం సేవించకుండా వారితో ప్రతిజ్ఞ చేయించినట్లు ఆయన వెల్లడించారు. ట్రాఫిక్ ఎస్ఐ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో శుక్రవారంఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో నలుగురు మహిళలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు పురుషులు, నలుగురు మహిళలు హుజూరాబాద్ మండలం చెల్పూర్ నుంచి ఆటోలో బయలుదేరి మొగిలిపాలెం వెళ్తున్నారు. ఈ క్రమంలో కేశవపట్నం గ్రామంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు గాయాలుకాగా వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న నిందితుడి అరెస్ట్

- రూ.2.4 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- పరారీలో ఇద్దరు



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న ఏసీపీ గజ్జి కృష్ణ

ఓదెల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత లక్ష్యంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఏసీపీ గజ్జి కృష్ణ వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన కంసాని అరుణ్ కారు డ్రైవర్‌గా, హమాలి కార్మికునిగా, టైల్స్‌వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అక్రమమార్గంలో డబ్బు సంపాదనపై దృష్టి పెట్టి గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడని తెలిపారు. ఈక్రమంలో కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన బొల్లెద్దు మహేందర్, చీమల ఆకాష్‌లతో పరిచయం ఏర్పడింది. ఒడిశా రాష్ట్రంలోని గుర్తుతెలియని వ్యక్తులనుంచి తక్కువధరకు గంజాయిని కొనుగోలు చేసి, కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల ప్రాంతాల్లో కళాశాల విద్యార్థులకు, యువకులను లక్ష్యంగా చేసుకొని కిలో గంజాయి అమ్ముతున్నారని తెలిపారు. ఇల్లందుకు చెందిన మహేందర్, ఆకాష్‌ల వద్ద అరుణ్ గంజాయి కొనుగోలు చేసి కారులో హుస్నాబాద్‌కు చేరుకున్నాడని తెలిపారు. హుస్నాబాద్, పెద్దపల్లి, ఓదెలప్రాంతంలో గంజాయిని విక్రయించి వస్తుండగా పొత్కపల్లి ఫంక్షన్ హాల్ శివారులో పోలీసులు కారును తనిఖీ చేయడంతో డిక్కీలో గంజాయి లభించిందని తెలిపారు. రూ.2.4 లక్షలవిలువచేసే 4.98కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొన్నామన్నారు. అరుణ్ పట్టుబడగా ఇల్లందుకు చెందిన బొల్లెద్దు మహేందర్, చీమల ఆకాష్‌లో పరారీలో ఉన్నారని ఏసీపీ తెలిపారు. గంజాయితో పాటు నిందితుడిని పట్టుకున్న సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై రమేష్, ఏఎస్ఐ రత్నాకర్, కానిస్టేబుళ్లు రాజుయాదవ్, హరీష్, రాము, శివశంకర్, రాజేందర్, రాజు, రమేష్‌లను డీసీపీ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ గజ్జి కృష్ణ అభినందించారు.

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరిట మోసం

- మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ అరెస్టు
- ఐపాడ్, 2 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం



నిందితుడు మాజీకార్పొరేటర్ కట్ల సతీష్‌ను అరెస్టు చూపుతున్న పోలీసు అధికారులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీలో పెట్టుబడిపెడితే మూడింతల లాభాలు వస్తాయని నమ్మబలికి సామాన్య ప్రజలను మోసం చేస్తున్న కేసులో నిందితుడు మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. లోకేష్, సాయి అనే మరోఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుడు కట్లసతీష్ వద్ద నుంచి ఒకఐపాడ్, 2 సెల్‌ఫోన్‌లు, ఇతర ఐడీ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కరీంనగర్ సీసీఎస్ సీఐ ప్రకాశ్‌గౌడ్, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ కట్ల సతీష్ మెటా ఫండ్ క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే మూడింతలు లాభాలు వస్తాయని పట్టణానికి నునావత్ భాస్కర్‌ను నమ్మించాడు.

తనవద్ద డబ్బులు లేవని చెప్పగా బయట 5శాతం వడ్డీకి తీసుకొచ్చి పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో 3రెట్లు అవుతాయని నమ్మబలికాడు. దీంతో భాస్కర్ 2024జూన్ 4న సరస్వతి నగర్‌లోని తన ఇంటిలో కట్లసతీష్‌కు 15లక్షల రూపాయలు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి కింద ముట్టజెప్పాడు. ఆ తరువాత మరి కొందరిని ఈ స్కీంలో చేరిపిస్తే మరిన్ని లాభాలు వస్తాయని చెప్పగా నమ్మిన భాస్కర్ తనకు పరిచయం ఉన్న కళ్లెం పహిపాల్‌రెడ్డి, మహేందర్, అజ్మీర తిరుపతి, బి.చంద్రనాయక్, బాలు నాయక్, బి.చందు, కె.తిరుపతి, బి. మహేష్, మంగీలాల్, అరుణ్, రామచంద్రమూర్తి, జి.రాందాస్, జలపతి, జి ఫకీర్దాస్, ఆర్.వెంకటేశ్వర్‌రావు, వంగల రూప, మోతె కరుణాకర్‌రెడ్డిని అదే నెల 11న భాస్కర్ ఇంట్లో సమావేశపరిచాడు. మూడు నెలల్లో 3 రెట్లు లాభాలు వస్తాయని కట్లసతీష్ వారిని నమ్మించాడు. 17మంది వద్ద మధ్యవర్తి మోతె సాయి ద్వారా కోటి 20 లక్షలు రూపాయలు కట్ల సతీష్ తీసుకున్నాడు. కాని ఇంత వరకు ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. కట్ల సతీష్‌ను నమ్మి వడ్డీకి డబ్బులు తెచ్చి ఇచ్చామని, వడ్డీ కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నామని భాస్కర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● దర్శించుకున్న సినీ నటుడు చిన్న



సినీ నటుడు చిన్నకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్నఆలయానికి వచ్చిన భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని తరించారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో సినీ నటుడు చిన్న..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని ప్రముఖ సినీనటుడు చిన్న దర్శించుకున్నారు. శుక్రవారం రాజన్నఆలయానికి వీచ్చేసినఆయన శ్రీస్వామి వారి ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు శిక్ష

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ళ జైలుశిక్షవిధిస్తూ శుక్రవారం జిల్లాజడ్జి కుంచాల సునీత తీర్పునిచ్చారు. 2017లో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి పట్టణానికి చెందిన బాలిక పాల ప్యాకెట్ తీసుకొచ్చేందుకు కిరాణ షాపునకు వెళ్ళింది. ఇంటికి తిరిగి వెళ్తుండగా మందల రవి అను వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి బాలికను ఇంటి వద్ద దింపుతానని ద్విచక్రవాహనంపై ఎక్కించుకున్నాడు. పట్టణ శివారుచెట్ల పొదల్లోకి తీసుకెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. కూతురు ఇంటికి రావడం లేదని తల్లి వెతుకుతుండగా బాలిక ఎదురుపడి జరిగిన విషయం తెలిపింది. తల్లి ఫిర్యాదుతో అప్పటిఎస్సై తడవేన శ్రీనివాస్ మందల రవిపై కేసు నమోదు చేశాడు. కోర్టు పీపీ బాదం రమేష్, అరెల్లి రాములు సాక్ష్యులను ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేయడంతో జడ్జి పదేళ్ళ జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధించారు. అలాగే జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ నుంచి బాధితురాలికి 2 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



మత్తడి దూకుతున్న ఎగువ మానేరు

జగిత్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరదనీరు రావడం శుక్రవారం స్వల్పంగా తగ్గింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 17,715 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 17,715 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మళ్లీ ఎగువ మానేరు పరవళ్లు..

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు మళ్లీ పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు, సిద్దిపేటలోని కూడవెల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఎగువ మానేరు జలాశయంలోకి వరద నీరు భారీగా వస్తోంది. దీంతో మానేరు మత్తడి దూకుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు శుక్రవారం 14630 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 13000, మానేరు ములవాగు ద్వారా 1630క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. కాగా దిగువ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కులు, ప్యాకేజీ10 లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజీ9లోని మల్కాపేట రిజర్వాయర్‌కు 600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.82 ఉండగా, నీటినిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.093 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు..

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.06టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రైతు వేదికలో షార్ట్‌సర్క్యూట్

కోనరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ రైతువేదికలో యూరియా పంపిణీ చేస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్విచ్‌బోర్డులో ఒక్కసారిగా మంటలు చెరగడంతో రైతులు, అధికారులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన అధికారులు, రైతులు మంటలార్పి వేయడంతో ప్రమాదం తప్పింది.



స్విచ్ బోర్డ్ వద్ద మంటలు

ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



అనిల్(ఫైల్)

బోయినపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముకుంద అనిల్(22) గతఏడాదిగా కుటుంబసభ్యులకు దూరంగా ఉండి ఒంటరిగా ఉంటూ కిరణంషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండునెలలుగా అనిల్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఒంటరితనం భరించలేక శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి బలవన్మరణం



శరత్ కుమార్(ఫైల్)

వెల్గటూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తునూర్ గ్రామానికిచెందిన సంగ శరత్ కుమార్(23) అనే యువకుడు శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు శరత్ డిగ్రీచదవడం మధ్యలోనే మానివేసి హార్వెస్టర్ కొనుగోలు చేసి దానిని నడుపుతూ జీవిస్తున్నాడు. కాగా అతను సంవత్సరం నుంచి ఛాతినొప్పితో బాధపడుతున్నాడు. ఆసుపత్రికి వెళ్లినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు శరత్‌కుమార్ తల్లి రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడు ఆత్మహత్య చేసుకునే ముందు తన స్నేహి తులకు తాను చనిపోతున్నట్లు మెసేజ్ పెట్టినట్లు సమాచారం. కాగా ప్రేమవ్యవహారమే ఆత్మహత్యకు కారణం కావచ్చని స్థానికులు చర్చించుకుంటు న్నారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో కొండూరుకు ఘన స్వాగతం

గంభీరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా విమానాశ్రయంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు ఘన సన్మానం లభించింది. శనివారంలో సిమ్లాలో జరగనున్న జాతీయ సహకార సమావేశానికి (సహకార పునర్జీవం) కొండూరు హాజరుకానున్నారు. సమష్టి సహకార బలం ద్వారా ఐవైసీ-2025 కార్యక్రమం కోసం రవీందర్‌రావు హిమాచల్ ప్రదేశ్‌కు శుక్రవారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ కార్యక్రమ ప్రతినిధులు రవీందర్‌రావుకు ఘనంగా స్వాగతం పలికారు.



సిమ్లా విమానాశ్రయంలో కొండూరు రవీందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న ప్రతినిధులు

ప్రాణాలకు రక్ష..

● నేడు ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం



సుభాష్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్నా.. ప్రమాదంలో గాయపడినా వైద్యసహాయం, అంబులెన్స్ వచ్చేవరకు ప్రాణాలను కాపాడటానికి అందించే తక్షణ వైద్య సహాయమే ప్రథమ చికిత్స. సెప్టెంబరు నెలలో రెండవ శనివారం ప్రపంచ ప్రథమచికిత్స దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రథమచికిత్స అంటే డ్రెస్సింగ్ నుంచి చిన్నవ్యాధుల చికిత్స, సీపీఆర్ (కార్డియాక్ పల్మనరీరెసాసిటేషన్)వరకు ఉంటాయి. ప్రథమచికిత్సకు నిపుణుడు లేదాశిక్షణ పొందిన వ్యక్తిలేదానిర్దిష్ట పరికరాలు, సామగ్రి అవసరం లేదు. అందుబాటులో ఉన్న వనరులతో పరిసరాలను తెలిసిన వ్యక్తికూడా ప్రథమచికిత్స అందించవచ్చు. అధికారిక ప్రథమచికిత్స ఉత్తమమైనప్పటికీ అప్పటివరకు కొన్ని ప్రాథమిక ప్రాణాలను రక్షించే పద్ధతులు, నైపణ్యాలను నేర్చుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

● ఎందుకంత ప్రాముఖ్యత..

అత్యసర పరిస్థితుల్లో ప్రతి సెకను విలువైనదే. సకాలంలో అందించే ప్రథమ చికిత్సవ్యక్తి ప్రాణాలను కాపాడుతుంది. అలాంటి పరిస్థితుల్లో ప్రథమచికిత్స కీలకంగా పరిగణించబడుతుంది. ప్రమాదం జరిగిన ప్రదేశం, లేదా గాయపడిన వ్యక్తిఉన్న ప్రదేశంచాలా దూరంలో ఉండవచ్చు. ఆ ప్రదేశం దూరంగా ఉండవచ్చు. నిపుణుడు చేరుకోవడానికి చాలా సమయం పట్టవచ్చు. అలాంటి పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందించి ప్రాణాలను కాపాడుకోవచ్చు.

● నిర్వహించే కార్యక్రమాలు

ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా ప్రథమ చికిత్సపై అవగాహన, శిక్షణను ప్రోత్సహించే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. సీపీఆర్ టెక్నిక్‌లు, పేపర్ కట్ ఎలా చేయాలి, బ్యాండేజ్ ఎలా వేయాలి, వంటివి ప్రదర్శనల ద్వారా తెలియచేస్తారు. ప్రథమ చికిత్సను నేర్చుకోవడం వల్ల ఎంత ఉపయోగకరం. కొన్ని సందర్భాల్లో ప్రథమ చికిత్స తెలిసిన వారు చికిత్స అందించడం వల్ల ప్రాణాలను కాపాడివారు అవుతారు.



తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు

● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

భారత్ ఆశలన్నీ నీరజ్‌పైనే



స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం



నేటి భారత షెడ్యూల్

ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి

సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్ లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్డేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక.మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.



ఫైనల్‌కు జైస్మీన్

సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మీన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మీన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఝర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు

బంగ్లాదేశ్ x శ్రీలంక

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హారిస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హారిస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).

ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జపనీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..

● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి

● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట

● 10 ఏళ్ల వరకు గడువు పెంపు

● సెబీ చైర్మన్ పాండే



ఇతర ప్రధాన నిర్ణయాలు

- రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
- రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
- నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
- రీట్స్, ఇన్విట్స్. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
- ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్ణీత గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు

● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అసోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ


ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్ల లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ


బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

- ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే.. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.
- హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్‌ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.
- టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఏఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

సన్నాల వైపే మొగ్గు

(3వ పేజీ తరువాయి)

ఇల్లంత కుంటలో 24000 ఎకరాలు, ముస్తాబాద్‌లో 23,000 ఎకరాలు, సిరిసిల్లలో 4800 ఎకరాలు, తంగళ్లపల్లిలో 20,100 ఎకరాలు, వీర్నపల్లిలో 8000 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 17,500 ఎకరాలు, బోయినపల్లిలో 12,600 ఎకరాలు, చందుర్తిలో 15,100ఎకరాలు, కోనరావుపేట 18,300 ఎకరాలు, రుద్రంగిలో 5910 ఎకరాలు, వేములవాడలో 5,200 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 11,300 ఎకరాల్లో వరి సాగు జరిగింది. పత్తి సాగు జిల్లాలో 46,385 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. ఇందులో గంభీరావుపేటలో 85 ఎకరాలు, ఇల్లంతకుంటలో 12,000 ఎకరాలు, ముస్తాబాద్ లో 530 ఎకరాలు, సిరిసిల్లలో 800 ఎకరాలు, తంగళ్లపల్లిలో 870ఎకరాలు, వీర్నపల్లిలో 300 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 3,600 ఎకరాలు, బోయినపల్లిలో 6,400ఎకరాలు, చందుర్తిలో 6,200 ఎకరాలు, కోనరావుపేట 4800 ఎకరాలు, రుద్రంగిలో 2,200ఎకరాలు, వేములవాడలో 4800 ఎకరా లు, వేములవాడ రూరల్‌లో 3,800 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు.

శిక్షణ కేంద్రంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఖేలో ఇండియా కబడ్డీ శిక్షణ కేంద్రంలో క్రీడాకారుల ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని శుక్రవారం జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్ తెలిపారు. ఖేలో ఇండియా కబడ్డీ శిక్షణ కేంద్రంలో ప్రవేశాలకు బాలబాలికలు 12 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 9959556017 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(ఎంఎస్‌టీసీఎస్), బీఎస్సీ(బీజడ్‌సీ), బీకాం(కంప్యూటర్స్), బీఏ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నామన్నారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో హాజరుకావాలన్నారు. వివరాలకు 7569860140, 7306379960, 8106385402 సెల్‌ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టడమే లక్ష్యం

- టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శ్రీకాంత్

వేములవాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం పనిచేస్తున్నదని టాస్క్‌ఫోర్స్ ఎస్సై శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని పలు పాన్‌షాప్‌లను ఆయన జాగిలాలతో తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయాలు జరిపినా కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. జాగిలాలతో తనిఖీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా 100కు డయల్ చేసి ఇలాంటి విక్రయాలపై సమాచారం తెలిపాలని ఆయన కోరారు. తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచి కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎల్లాగౌడ్ తదితరులు ఉన్నారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరు యువకుల అరెస్ట్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు యువకులను వీర్నపల్లి మండల కేంద్రం శివారులో శుక్రవారం పట్టుకుని వారి వద్ద నుంచి 20 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకున్నామని ఎస్ఐ లక్ష్మణ్ శుక్రవారం పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం లాల్‌సింగ్‌తండా, గర్జనపల్లి గ్రామాలకు చెందిన యువకులు మాలోతు దినేష్, గుమ్మడి భరత్‌లను ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని వెల్లడించారు. దినేష్, భరత్‌లు గంజాయికి అలవాటుపడడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చి వీర్నపల్లిలో అమ్ముతున్నారనే సమాచారంతో తమ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నామని తెలిపారు. సోదా చేయగా వారి ఎండు గంజాయి లభించిందని చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు. గంజాయి, యువకులను పట్టుకున్న ఎస్ఐ లక్ష్మణ్, సిబ్బందిని సీఐ శ్రీనివాస్ అభినందించారు.

దుర్గమ్మ ఆలయంలో ధర్మగంట చోరీ

కోనరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దుర్గా మాత ఆలయంలో ధర్మగంటను దొంగిలించారు. ఈ విషయమై గ్రామస్తులు కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

కోనరావుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల ప్రాథమిక వ్యవసాయ కమిటీ చైర్మన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ బండ నర్సయ్య, వట్టిమల్ల మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ దర్మనాల శంకరయ్య తదితరులతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారిని కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానించారు. ఈసందర్భంగా ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ బిడ్డ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. ఈ సందర్భంగా కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, పలు వురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

'పార్టీని వీడిన వారితో నష్టం లేదు'

కోనరావుపేట : మండలంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో బీఆర్ఎస్‌కు నష్టం లేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి అన్నారు. కోనరావుపేటలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, దర్మనాల శంకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారని, వారితో పార్టీకి ఏ నష్టం లేదని అన్నారు. ఈ సందర్భంగా గోపు పరశురాములు, నాగుల రాజు, పరశురాములుగౌడ్, ప్రతాపరెడ్డి, గోపి రావు, శ్రీని వాస్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ పంట విక్రయం.. రైతుల్లో ఆనందం..

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు నాలుగేళ్ల కిందట నాటిన ఆయిల్‌పామ్ మొక్కలు ఏపుగా పెరిగి గెలలు కాయడంతో దిగుబడి చేతికొచ్చింది. గెలలను చూసి రైతులు మురిసిపోతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలోని రైతు పాతూరి భూపాల్‌రెడ్డి తనకున్న 9 ఎకరాల విస్తీర్ణంలో నాలుగేళ్ల కిందట ఆయిల్‌పామ్ సాగు చేశాడు. గెలలను కోయించి శుక్రవారం ఫ్రీ యూనిక్ సంస్థకు విక్రయించాడు. 220 కిలోల వరకు దిగుబడి వచ్చిందని రైతు భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అయిల్‌పామ్ తోట కాతకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాబో యే రోజుల్లో మరింతా దిగుబడి పెరిగి ఆదాయం రానుందని రైతు భూపాల్‌రెడ్డి తెలిపారు. క్వింటాలుకు రూ.1900 ధర పలికిందని పేర్కొన్నారు. మండలంలో మొత్తం ఆరుగురు రైతులు 30 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేశారు. మరో నెల రోజుల్లో ఆయిల్ పామ్ దిగుబడి పూర్తిస్థాయిలో చేతికందనుందని రైతులు పేర్కొన్నారు.



ఆయిల్‌పామ్ గెలలను చూపుతున్న రైతు భూపాల్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- రోగులకు మెరుగైన సేవలందించాలి - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - తంగళ్లపల్లి పీహెచ్‌సీ తనిఖీ

తంగళ్లపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు రికార్డులు, అన్ని వార్డులు, మందుల గదిని పరిశీలించారు. ప్రతి రోజు అసుపత్రికి ఎంద మంది వస్తున్నారు తదితర విషయాలను ఆరాతీసి రోగులతో వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో అందించే సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.



రోగులతో మాట్లడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

రుద్రంగి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మరమ్మతుల కోసం రూ. 36 లక్షలు, కేజీబీవీ పాఠశాలలకు రూ.8లక్షల నిధులు మంజూరు కావడంతో విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిధులు మంజూరుచేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, తర్రె లింగం, పల్లి గంగాధర్, మాడిశెట్టి అభిలాష్, ఎర్రం రాజలింగం, కోమిరె శంకర్, పిడుగు లచ్చిరెడ్డి, గుగ్గిళ్ల వేంకటేశం ఎర్రం ఆరవింద్, దాసు, దయ్యాల శ్రీనివాస్, గండి ఆశోక్, అక్కనపల్లి శ్రీనివాస్, సూర యాదయ్య, పల్లికొండ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

చందుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తినిస్తాయని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు అన్నారు. చందుర్తి మండలంలోని బండపల్లి గ్రామంలో కామ్రేడ్ గడ్డం తిరుపతిరెడ్డి స్తూపం వద్ద శుక్రవారం సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల త్యాగాలను గుర్తుకు తెచ్చుకుంటూ, భావితరాలకు వారి స్ఫూర్తిని తెలిపేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్రం వచ్చిన తెలంగాణకు మాత్రం నిజాం నవాబు వల్ల రాలేదని, 3000 గ్రామాలు విముక్తం చేసి 4500మంది ప్రాణాలు అర్పించారన్నారు. వారి పోరాట స్ఫూర్తిగా నేటి తెలంగాణ రాష్ట్రం అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులపై దమనకాండ చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజా పోరాటాల్లో సీపీఐ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు కెవి అనసూర్య, కూరేపు క్రాంతి, పెంట రాజేశం, నారాయణ, రమేష్, శంకర్, శ్రీరాముల నరసయ్య, ఎడవెల్లి శీను తదితరులు పాల్గొన్నారు.



గడ్డం తిరుపతిరెడ్డి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు గుర్తింపు



సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు లభిస్తుందని స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిణి ప్రేమలత పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, బోయినిపల్లి మండలాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదన్నారు. భవిష్యత్తు తరాలను ఉత్తములుగా మార్చేది ఉపాధ్యాయులే అన్నారు. ఈసందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన సింగిరెడ్డి వీరారెడ్డి, చంద్రమౌళి, లత, అరుట్ల ప్రభాకర్‌లను సన్మానించగా, మూడు మండలాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలు గుర్తింపునిస్తాయి..

చందుర్తి : ఉద్యోగులకు విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని మండల విద్యాధికారి వినయ్ కుమార్ అన్నారు. ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులు దేశెట్టి మల్లేశం, తక్కల్ల లచ్చిరెడ్డిలను మూడపల్లి కాంప్లెక్స్ సముదాయంలో మండల విద్యాధికారి వినయ్ కుమార్ శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేశం, రాజన్నసిరిసిల్ల జిల్లా బయోసైన్స్ ఫోరం అధ్యక్షులు, పాముల దేవయ్య, ప్రధాన కార్యదర్శి మెడపట్ల కిషన్, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయ

లక్ష్మీపూర్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరం..

- ఏడు రోజుల పాటు కొనసాగనున్న శిబిరం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో గిరిజన మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రత్యేక శిబిరం శుక్రవారం ప్రారంభం అయ్యింది. ముందుగా ప్రారంభ సమావేశం నిర్వహించిన అనంతరం శ్రమదానం తదితర సేవా కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయ, వైస్‌ప్రిన్సిపాల్ రేహనా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వాణిశ్రీ, గ్రామ ప్రత్యేక అధికారి సాగర్, కార్యదర్శి గీత, పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి, ఏఎంసీ డైరెక్టర్ ఆరేపల్లి బాలు, అధ్యాపకులు నవ్యశ్రీ, లావణ్య పాల్గొన్నారు.

ఘనంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మజీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుక లను ఘనంగా నిర్వహించారు. ఉదయం పట్టణ ప్రధాన రహదారు ల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం మజీద్‌లో ప్రార్థన ల అనంతరం జామే మసీద్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంత రం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఖీర్ ఫాతిహా చేసి పంపిణీ చేశా రు.మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సమీ, మాజీ అధ్యక్షుడు ఎండీ సలీం, ప్రధాన కార్యదర్శి రఫీ, గౌరవ అధ్యక్షుడు సయ్యద్ సమద్, యూసుఫ్, సత్తార్, సాదిక్, జాంగిర్, రియాజ్, ఫయాజ్, అంజాద్, షాదాబ్, చాంద్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మత సామరస్యానికి ప్రజా ప్రభుత్వం మద్దతు

మత సామరస్యాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా పూర్తి మద్దతునిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సిరిసిల్ల మసీద్ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ మాట్లాడారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు సదా ఆచ రణీయమన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి. గితేని మసీద్ కమిటీ సభ్యులు సన్మానిం చారు. అనంతరం ముగ్ధ మొయినుద్దీన్ మహమ్మద్ ప్రవక్త బోధ నలపై ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథా లయ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మసీద్ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి) : మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లోని ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక మజీద్‌ల నుంచి పురవీధుల గుండా ర్యాలీ కొనసాగింది. అంతకు ముందు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు జహంగీర్, ఇర్ఫాన్, హైమద్, సాహెబ్, లాల్‌మహ్మద్, అహ్మద్, బాబా, తాజొద్దీన్, రఫీక్, తాజ్, మసీద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో ఫోటోట్రేడ్ ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను మండల ఫొటోగ్రాఫర్ల సంఘ అధ్యక్షుడు గూడ బాబు శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఈనెల 19 నుండి హైద్రాబాద్‌లో జరిగే ఫోటోట్రేడ్ ఎక్స్‌పోలో అన్ని గ్రామాల ఫోటోగ్రాఫర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మఠం తిరుపతి, రేగుల కృష్ణ, మామిడి కమలాకర్, పారునంది శ్రీనివాస్, ఎంఢ్ర రాజు, రాజేష్‌ఖన్నా, విష్ణు తదితరులు పాల్గొన్నారు

వేధింపులపై షీటీంకు సమాచారం ఇవ్వాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఎక్కడైనా వేధింపులకు గురయితే షీటీంకు సమాచారం ఇవ్వాలని ఏఎస్సై ప్రమీల పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, అనంతారం, వల్లంపట్ల, కందికట్కూర్ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం అవగాహన సమావేశాలు జరిగాయి. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్‌మీడియాలో వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో ఏఆర్ఏఎస్సై వీరయ్య, పీసీలు శ్రీనివాస్, శ్రీలత, ప్రియాంకలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రాజయ్య కుటుంబానికి మాజీ సర్పంచ్ బాలరాజ్ నర్సాగౌడ్ క్వింటాల్ బియ్యం శుక్రవారం వితరణ చేశారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, చంద్రయ్య, మహేందర్, యాదగిరి, బిక్షపతి, సాగర్, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ క్షయ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని క్షయ వ్యాధి నివారణ పర్యవేక్షకుడు మహిపాల్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని ఆరోగ్య ఉప కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సారియా అంజుమ్ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన కల్పించారు. 145 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 26 మంది అనుమానితుల నుంచి తెమడను సేకరించారు. పోగాకు తాగేవారు క్షయ వ్యాధి బారిన పడే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మ, రేవతి, భారతి, కమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

రుద్రంగి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో ఈనెల 15న జరిగే కాంగ్రెస్ పార్టీ బీసీ సభను విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ మండల అధ్యక్షుడు గండి నారాయణ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో రుద్రంగి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, బీసీ నాయకులు కామారెడ్డిలో జరిగే బీసీ గర్జన మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ మండల అధ్యక్షుడు గండి నారాయణ, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, తర్రె లింగం, పల్లి గంగాధర్, మాడిశెట్టి అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

రుద్రంగి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యాతో పాటు క్రీడల్లో రాణించాలని మార్కెట్ కమిటి చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మండల విద్యాధికారి రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'సేవా పక్షం'

రుద్రంగి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారతీయజనతా పార్టీ రుద్రంగి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు కర్ణావతుల వేణు అధ్యక్షతన సేవా పక్షం కార్యశాల శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా పక్షం రోజులు చేయవలసిన సేవా కార్యక్రమాలు గురించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, బాలకిషన్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

చందుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించాలని ఎంపీడీవో రాధ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ అంగన్‌వాడీ కేంద్రంను ఎంపీడీవో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని రిజిస్టర్లు, భోజనం తనిఖీ తనిఖీ చేశారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, అంగన్‌వాడీ టీచర్ విజయ పాల్గొన్నారు.

బతుకమ్మ తెప్ప వద్ద మహిళల నిరసన..



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

బోయినపల్లి సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి స్టేటస్‌కో ఉన్న పనులు కొనసాగిస్తున్నారంటూ కొంతమంది మహిళలు శుక్రవారం నిరసనకు దిగారు. గ్రామం నడి ఒడ్డున 24 గుంటల భూమి ఉంది. అట్టి స్థలంలో బతుకమ్మ తెప్పనిర్మానానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. గ్రామానికి చెందిన బుల్లెవెని తిరుపతి తెప్ప నిర్మాణంపై హైకోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు ఈనెల 15వరకు తెప్ప యథాస్థితిలో ఉంచాలని కోర్టుస్టేటస్‌కో ఇచ్చింది.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

తంగళ్లపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని వేణుగోపాల్‌పూర్ మాజీ సర్పంచ్ పీసు మల్లారెడ్డి కుమారుడు వెంకటరమణరెడ్డి ఇటివల అనారోగ్యంతో మృతిచెందాడు. శుక్రవారం కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే మృతుడి భార్యకు ఉద్యోగ ఉపాధి కల్పించడంతో పాటు పిల్లల చదువులకు సహాయసహకారాలు అందిస్తానని హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ జల్లం ప్రవీణ్ కుమార్, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, నాయకులు లింగాల భూపతి, డైరెక్టర్లు బాలు, పర్శరాములు, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, జలంధర్, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషనల్ సపోర్టు కిట్ అందజేత

తంగళ్లపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రాథమీక ఆరోగ్య కేంద్రంలో నిక్షయ్ పోషణ్ యోజన కార్యక్రమం కింద న్యూట్రిషన్ సపోర్టు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఆఫీజ, డాక్టర్ అంజలిసీ, డాక్టర్ అనిత, సబ్ సెంటర్ వైద్య సిబ్బంది జ్యోతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.